క్లుప్తంగా

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగండి


మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

సీతంపేట: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని ఫోర్త్‌టౌన్ సీఐ వెంకటరావు అన్నారు. మంగళవారం అక్కయ్యపాలెం ఎన్జీఓస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌ను తన సిబ్బందితో కలిసి సందర్శించిన ఆయన, ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లో గేమ్స్, రీల్స్‌తో కాలక్షేపం చేస్తూ చదువును నిర్లక్ష్యం చేయవద్దని హితవు పలికారు. సమయపాలన పాటిస్తూ, ప్రతిరోజూ క్రమం తప్పకుండా స్కూల్‌కు హాజరై టీచర్లు చెప్పిన పాఠాలు శ్రద్ధగా వినాలని, పాఠ్యాంశాలలోని సందేహాలు వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుతూ మంచి మార్కులు సాధించి ఉన్నతంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు సేవించేవారికి దూరంగా ఉండాలని కూడా ఆయన విద్యార్థులకు సూచించారు. పాఠశాల హెచ్‌ఎం జయంతి రాధా కుమారి మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికతో పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రత్నం, జ్యోతి, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎన్.వి. విశ్వనాథం, ఉపాధ్యాయులు సునీత, గ్లోరీ, హైమ, నిర్మల, కిశోర్, అప్పారావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఏఐటీటీలో ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతం


కంచరపాలెం పాత ఐటీఐలో ప్రాక్టికల్ పరీక్షలు పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

కంచరపాలెం: స్థానిక ఐటీఐ జంక్షన్ వద్ద ఉన్న పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో వివిధ ట్రేడ్‌లకు నిర్వహించిన ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ (ఏఐటీటీ) ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. జూలై 17న ప్రారంభమైన ఈ పరీక్షలు ఎటువంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.వేంకటేశ్వరరావు తెలిపారు. ఈ పరీక్షలను రీజినల్ డైరెక్టర్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ (ఆర్డీఏటీ) నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీకాంత్, డిపార్ట్‌మెంటల్ విజిలెన్స్ స్క్వాడ్ అధికారి సాల్మన్, జోన్-1 రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ (ఆర్డీడీ) అధికారి ఆర్.వి. రమణ పర్యవేక్షించారు. పరీక్షల్లో ఎటువంటి అవకతవకలు, మాల్‌ప్రాక్టీస్‌కు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

మురళీనగర్ స్విమ్మర్లకు పతకాల పంట


విజేతలను సత్కరిస్తున్న వైశాఖి స్పోర్ట్స్ పార్కు ప్రతినిధులు

మురళీనగర్: విశాఖ బీచ్ రోడ్‌లోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ విభాగంలో బాల బాలికలకు నిర్వహించిన ఆక్వాటిక్ స్విమ్మింగ్ పోటీల్లో మురళీనగర్ స్విమ్మర్లు పతకాల పంట పండించారు. వీరు విశేష ప్రతిభ చూపి రెండు బంగారు, మూడు రజిత, రెండు కాంస్య పతాలకు సాధించారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్రీడాకారులను సత్కరించారు. స్విమ్మింగ్ పూల్ విభాగంలో గ్రూప్-2 లో పాల్గొన్న ప్రియేష్ నాయుడు 50 మీటర్లు, 100 మీటర్లు బ్రెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతకాలు, 200మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ లో రజిత పతకం సాధించగా గ్రూప్-3 లో బండి సౌరవ్ 100మీటర్లు ఫ్రీ స్టైల్, 100 మీటర్లు బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజిత పతకాలు, 200 మీటర్లు ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకం సాధించారు. సనపల ప్రేమ్ కుమార్ గ్రూప్-2 లో 100మీటర్లు ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకం సాధించారు. కార్యక్రమంలో పార్కు ఉపాధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కనకరాజు, కోశాధికారి ఎం.రామకృష్ణ , కార్యవర్గ సభ్యులు ఎల్‌వీ సుధాకర్, టీఎస్ఎన్ రాజు, ఆర్.నాగేశ్వరరావు, వీర రాఘవయ్య పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా?


ఊర్వశి కూడలిలో ఫుట్‌పాత్‌పై ట్రాన్స్‌ఫార్మర్


దుర్గానగర్‌కు వెళ్లే రహదారి ఫుట్‌పాత్‌పై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


మల్లసూరివీధి నుంచి 104 ఏరియాకు వెళ్లే మార్గంలో...

- ఫుట్‌పాత్‌లపై ట్రాన్స్‌ఫార్మర్లు
- రక్షణ కవచాలు లేక ఇబ్బందులు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు


ఐటీఐ జంక్షన్‌కు వెళ్లే శ్రీనగర్ రహదారిలో..


కంచరపాలెం బీఆర్‌టీఎస్ సబ్‌వే రైతుబజారు వద్ద ఇలా..

కంచరపాలెం: జీవీఎంసీ 54, 55 వార్డుల పరిధిలోని కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్ ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రహదారులపై ప్రమాదకరంగా ఉన్నాయి. రెడ్డికంచరపాలెం, జాషువానగర్, వివేకానందవీధి, దుర్గానగర్, శ్రీనగర్, రవీంద్రనగర్, దేవేంద్రనగర్, సిద్దార్థనగర్, సంకురపేట, భవానిగార్డెన్స్, బాపూజీనగర్, జ్యోతినగర్, మహారాణివీధి, కంచరపాలెం రైతుబజారు తదితర ప్రాంతాల్లోని ఊర్వశికూడలి నుంచి కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని ఈ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా మారాయి. వాహనాలు ఈ ట్రాన్స్‌ఫార్మర్లను ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, ప్రభుత్వ స్థలాల్లోనే దుకాణాలకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. గత ఏడాది కంచరపాలెం రైతుబజారు ప్రధాన ద్వారం పక్కన ఉన్న ఫుట్‌పాత్‌పై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తెగిపడిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఆ సమయంలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

చిరు వ్యాపారుల ఇష్టారాజ్యం

సమీప దుకాణాలకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను లోపల ఏర్పాటు చేయలేని యజమానులపై చర్యలు తీసుకోకపోవడం వల్ల మరికొందరు బీఆర్‌టీఎస్ రహదారులపైనే ట్రాన్స్‌ఫార్మర్లకు ఆనుకుని చిల్లర వర్తకులు దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే బీఆర్‌టీఎస్ రహదారిలో విద్యుత్ స్తంభాలు ఫుట్‌పాత్‌లకు ఆనుకుని దుకాణాలపై ఏర్పాటుచేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండతో బీఆర్‌టీఎస్ సబ్‌వేలో ఏర్పాటుచేసి రహదారులను కుదించేశారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునే చిల్లర వర్తకుల దుకాణాలు తొలగించే టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, ఏపీఈపీడీసీఎల్ అధికారులు బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లపై అడ్డంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు స్పందించి రహదారిపై ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్లు

బీఆర్‌టీఎస్ రోడ్డులో పలు దుకాణాలకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. బీఆర్‌టీఎస్ పేరిట రోడ్లు ఇప్పటికే కుదించుకుపోగా, అదనంగా ఈ ట్రాన్స్‌ఫార్మర్లు రహదారిపై ఉండటంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఫుట్‌పాత్‌లపై అడ్డంగా ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలోనూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నప్పటికీ, సంబంధిత అధికారులు ఇప్పటికీ స్పందించలేదు. –వై.బాబులు, వాహనదారుడు, మర్రిపాలెం.

నడవడానికి ఇబ్బందిగా ఉంది

పలు ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై దుకాణాలకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. భారీ వాహనాలు వెళ్లేటప్పుడు అవి తగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పాదచారులు సైతం ఈ ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.ఈ సమస్యపై సంబంధిత ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫుట్‌పాత్‌లపై అడ్డంగా ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్లను తక్షణమే తొలగించి, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. – డి.ధనలక్ష్మి, దుర్గానగర్, కంచరపాలెం

అలరించిన మధుర గీతాలాపన


మధుర గీతాలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

సీతంపేట: ఎంవీఆర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన 'స్వర రాగ గంగా ప్రవాహమే' సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ గాయనీ గాయకులు ఆపాత మధురగీతాలను ఆలపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. గాయనీ గాయకులు పెమ్మరాజు రామ్, నూకల ప్రభాకర్, గంటి ఉష, సి.వి.రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, అంబిక, శ్రీనివాస్, ప్రభాకర్, రామనరసింహం, నాగేశ్వరరావు ఆలపించిన పాటలు ఆహూతులను ఉర్రూతలూగించాయి.

యోగసిద్ధాంజనేయుడికి సింధూర అర్చన


ప్రత్యేక అలంకరణలో యోగసిద్ధాంజనేయుడు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్‌లో వెలసిన యోగ సిద్ధాంజనేయుడికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంతాచార్యుడు ఆధ్వర్యంలో శ్రీపాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సింధూర అర్చన, తమలపాకుల పూజ నిర్వహించారు. అనంతరం స్వామికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు సామూహిక సుందరాకాండ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.సుబ్బరాజు, యశోధ దంపతులు, ఆలయం కమిటీ సభ్యుడు ఎంవీ రాజశేఖర్, కె.గోపాల్ చిరంజీవి పాల్గొన్నారు.

సమాజవాది, పోరాటయోధుడు దాశరథి


మాట్లాడుతున్న సాహితీ విశ్లేషకుడు డాక్టర్ డీవీ సూర్యారావు

సీతంపేట: తెలంగాణ ఉద్యమ కవి, దివంగత దాశరథి కృష్ణమాచార్య శత జయంత్యుత్సవ సభ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం ఘనంగా జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, విశ్లేషకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అరసం జిల్లా అధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు సభాధ్యక్షత వహించారు. గత ఏడాది ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జరిగిన దాశరథి ఉత్సవాలను గుర్తుచేసుకుంటూ తెలంగాణ కవి అయినప్పటికీ దాశరథి తెలుగు తల్లిని ప్రస్తావించిన వైనాన్ని కొనియాడారు. ప్రముఖ సాహితీ విశ్లేషకులు డాక్టర్ డీవీ సూర్యారావు దాశరథి ఉద్యమ సాహిత్యంపై లోతైన విశ్లేషణ చేశారు. 'ఆ చల్లని సముద్ర గర్భం' పద్యంతో ప్రారంభించి, దాశరథి రచనలన్నింటినీ స్పృశించారు. కవికి ప్రాంతీయ భేదం ఉండదని ఉద్ఘాటించిన ఆయన, దాశరథిని ఒక సమాజవాది, పోరాటయోధుడిగా అభివర్ణించారు. 'దాశరథి ఒక శాంతి విప్లవం. జైల్లో ఉండి కూడా కవిత్వం మరువని మహోన్నత సాహితీవేత్త' అని ప్రశంసించారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్న దాశరథి ప్రఖ్యాత వాక్యాన్ని సోదాహరణంగా వివరించారు. రైతుల గురించి దాశరథి కవిత్వాన్ని వివరిస్తూ, ఆయన 'దిగిపో' అని గర్జించిన ధైర్యశాలి అని, తిమిరంతో సమరం చేసిన మహాకవి అని విశ్లేషించారు. ప్రఖ్యాత వ్యాఖ్యాత రాంభట్ల నృశింహ శర్మ దాశరథి రాసిన చలన చిత్ర గీతాలపై మాట్లాడారు. 'ఆ రజనీకర బింబం' పాటతో తన ప్రసంగాన్ని ప్రారంభించి, 'గరళము నుంచి సరళమునకు సాహిత్యాన్ని దించిన కవి దాశరథి' అని అభివర్ణించారు. దాశరథి సినీ గీత రచనను సభకు పరిచయం చేశారు. అరసం ఉపాధ్యక్షుడు ఎస్. హనుమంతరావు మాట్లాడుతూ దాశరథి కవిత్వంలో మానవతా కేతనం ఎగురుతుందని గుర్తుచేశారు. కవి బసు పోతన సభా ప్రారంభంలో స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు పాల్గొని దాశరథి కృష్ణమాచార్య సాహిత్యం, ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఘనంగా తాజుద్దీన్‌బాబా చందనోత్సవం


హజరత్ తాజుద్దీన్ నిషానిపై చాదర్ సమర్పిస్తున్న భక్తులు


సందల్ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లోని హైవేకు సమీపంలో ఉన్న తాజ్‌బాగ్ దర్గాలో మంగళవారం హజరత్ తాజుద్దీన్ బాబా 72వ చందనోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకలో భాగంగా, అక్కయ్యపాలెం తాజ్‌బాగ్ నుంచి కోటవీధిలో ఉన్న హజరత్ ఇషాక్ మదీనా ఔలియా దర్గాకు సందల్ ఊరేగింపు బయల్దేరింది. అక్కడి నుంచి తిరిగి అక్కయ్యపాలెం దర్గాకు చేరుకోవడంతో చందనోత్సవం పూర్తయ్యింది. ఈ సందల్ ఊరేగింపులో ఫకీర్ మేళా, బ్యాండ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తాజ్‌బాగ్ దర్గాలో గల హజరత్ తాజుద్దీన్ నిషానిపై సందల్ పూసి, చాదర్ (పవిత్ర వస్త్రం) వేసి, గులాబీ పువ్వులు సమర్పించారు. అనంతరం ఫాతేహా, సలాతు సలాం వంటి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ప్రసాద వితరణ చేశారు. ఈ చందనోత్సవంలో పెద్ద ఎత్తున హిందూ, ముస్లింలు పాల్గొని మత సామరస్యాన్ని చాటారు.

ఎన్‌ఏడీలో వర్షం


వర్షంతో ఎన్ఎస్‌టీఎల్ రహదారి


జోరువానలోనూ పయనం

విశాఖ విద్య: నగరంలో ఎండ తీవ్రత కొనసాగుతోంది, దీనికి తోడు ఉక్కపోతతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మంగళవారం ఉదయం ఎన్ఏడీ సెంటర్ పరిసరాల్లో కురిసిన వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. సుమారు పావుగంటకు పైగా కురిసిన ఈ జోరువానతో ఆ ప్రాంతం ఒక్కసారిగా చల్లబడింది. వర్షం కారణంగా రోజువారీ విధులకు హాజరయ్యే వారికి అసౌకర్యం కలిగినా, ప్రజలు వర్షంలోనే తమ ప్రయాణాన్ని కొనసాగించారు. ఆకాశంలో మబ్బులు కమ్మి, ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఎన్ఏడీ ఏరియాలో చల్లని గాలులతో ప్రజలు సేదతీరారు. నగరంలోని మిగతా ప్రాంతాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండగా, ఎన్ఏడీ ప్రాంతంలో మాత్రం వర్షం కారణంగా వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

నేడు కంటి వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం దరి దాలిరాజు సూపర్‌మార్కెట్ సమీపంలో గల వివేకానంద ఆస్పత్రిలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజన్ ట్రీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు క్యాటరాక్ట్, గ్లకోమా, రెటీనా వంటి పరీక్షలు చేస్తారు.

కూటమి మోసపూరిత హామీలను నిలదీద్దాం

- హామీలు అమలయ్యే వరకు పోరాటం
- 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు


'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కేకే రాజు


బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

సీతంపేట: కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 2024 ఎన్నికల మ్యానిఫెస్టోలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తామని ప్రజలను నమ్మించి, తీరా అధికారంలోకి వచ్చాక మొండి చేయి చూపించారని ఆయన ఆరోపించారు. జీవీఎంసీ 26వ వార్డు పరిధిలోని మధుర ఇన్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు పీలా వెంకటలక్ష్మి, బొడ్డేటి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' సభలో కె.కె.రాజు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి పార్టీలు ఇంటింటికీ వెళ్లి పథకాలు అమలు చేస్తామని బాండ్లు రాసి మరీ ఇచ్చాయని, అయితే అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా హామీలు అమలు చేయకపోగా, ప్రజలు అడిగితే నాలుక మందమని సమాధానం చెబుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' పేరిట ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని కేకే రాజు విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' నినాదంతో ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను, వైఫల్యాలను వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు. విద్య, వైద్య రంగాలలో జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చి, ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం అందేలా కృషి చేశారని కె.కె.రాజు గుర్తు చేశారు. ఉత్తర నియోజకవర్గంలో కొత్తగా ఆరు పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతి రోజూ స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందించేవారని తెలిపారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక స్పెషలిస్ట్ వైద్యులను తొలగించి, కనీస వైద్యం అందకుండా ఆరోగ్య రంగాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు సుమారు 30 సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేసిందని, కానీ కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేక విఫలమైందని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు తమ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తుంటామని కేకే రాజు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, యువజన విభాగం రీజినల్ కో–ఆర్డినేటర్ అంబటి శైలేష్, 26వ వార్డు నాయకులు సునీల్, పాతోజు అమ్మాజీ, దేవుడు బాబు, విజయ్‌పాల్, ప్రకాష్, ఫరూఖ్, బాబ్జాన్, శ్రీదేవి, రమాదేవి, సుశీల, కార్యకర్తలు, బూత్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అంటే నమ్మకం.. చంద్ర బాబు అంటే మోసం


పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మురళీనగర్: మోసపూరిత హామీలతో కూటమి అధికారంలోకి వచ్చిందని, ప్రజలను పట్టించుకోవడం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు విమర్శించారు. మంగళవారం 49వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకర రావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన అసాధ్యమైన హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలు ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఓ నమ్మకమని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత ఆయనదేనన్నారు. చంద్రబాబుకు ప్రజలను మోసగించడం అలవాటేనని విమర్శించారు. ముందుగా వార్డు నాయకులతో సమావేశమైన కేకే రాజు 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం నేరుగా ప్రజల వద్దకు వెళ్లి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి, చంద్రబాబు చేసిన మోసాలను వీడియో రూపంలో వివరించారు. కార్యక్రమంలో 49వ వార్డు అధ్యక్షుడు అయినింటి రవి కుమార్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సేనాపతి అప్పారావు, 50వ వార్డు అధ్యక్షుడు వేణు, 49వ వార్డు నాయకులు చంద్ర మౌళి, శివ రామ్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కర్రి రామ రెడ్డి, వార్డు నాయకులు, కార్యకర్తలు, పోలింగ్ బూత్ కన్వీనర్లు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సెక్యులర్, సోషలిజం పదాల తొలగింపుపై డీహెచ్‌పీఎస్ ఆందోళన


మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్

సీతంపేట: రాజ్యాంగ సవరణ ద్వారా సెక్యులర్, సోషలిజం పదాలను తొలగించడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ ఆరోపించారు. మంగళవారం రామా టాకీస్ రోడ్‌లోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం గల దేశమని, బీజేపీ 'సెక్యులర్' పదాన్ని తొలగించాలని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తోందన్నారు. ఇది ఒక్క దళితుల సమస్య కాదని, దేశంలోని ప్రజలందరి సమస్యగా గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 26న అంబేడ్కర్ భవన్‌లో జరగనున్న డీహెచ్‌పీఎస్ జిల్లా 5వ మహాసభలను జయప్రదం చేయాలని ప్రభాకర్ కోరారు. ఈ మహాసభలకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, వివిధ సంఘాల నాయకులు హాజరవుతారని తెలిపారు. డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజులు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత దళితులందరిపైనా ఉందన్నారు. సమావేశంలో రాంబాబు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.